# సఫలీకృత

రచన:
శ్రీ కోపల్లె రామారావు

సాయంకాలమయింది పశ్చిమాద్రి నలంకరించడానికి ఉబలాటపడుతున్న సూర్యుడు నీరెండమాత్రమే ప్రసాదిస్తున్నాడు. మనోజ్ఞంగా వీస్తున్న చల్లగాలికి ముంగురులు మోముపై నాట్యమాడుచుండగా గేటు తలుపులు తీసి వయ్యారంగా గోడను ఆనుకుని వీధిలోనికి తదేకంగా చూస్తోంది ఆమె. ఆమె కనులలోని ఆతృత, మోముపైని విసుగు ఆమె ఎవరి రాకనో కాంక్షిస్తోందని, ఎవరికోసమో నిరీక్షిస్తున్నదను నగ్న సత్యాన్ని చెప్పక చెబుతున్నాము.

తలంటి పోసుకుని పదులుగా అల్లిన రెండు జడలు, ఒక జడలో మాత్రమే తురిమిన అందమయిన రోజా పూవు. ఆమె ధరించిన నిప్పువంటి ఎఱ్ఱ రంగు వెల్వెటు జాకెట్టు లైటు కలరు టెర్లిన్ శారి మెడలోని చైను. ఆమెయొక్క ఆధునిక అలంకరణాభిరుచిని తెలియచేస్తున్నాయి.

గుండ్రని మోము. నిండయిన బుగ్గలు. నవ్వినప్పుడు ఆ బుగ్గలపై ఏర్పడే లోతయిన సొట్టలు. మీన, మిథునాలవంటి కన్నులు. నిడుపయిన నాశిక. దొండపండు వంటి అధరాలు. తెల్లని పలువరుస. ఆమె ముఖంలో ఏవి ఎక్కడ ఉండాలో అక్కడ అమర్చాడు విధాత. చూసిన మగవారిని పిచ్చివారిగా చేస్తాయనడంలో ఆశ్చర్యం ఏమియూ లేదు. చూచి చూచి విసుగుచెందింది కాబోలు ఆమె ధడాలున తలుపులు మూసి కోపంగా లోనికెళ్ళిందామె.

* * * *

గదిలో మంచంపై పడుకున్నదేగాని భారతికి దుఃఖం ఆగటము లేదు. అది దుఃఖమనేకన్నా ఉక్రోషం అంటే అందంగా ఉంటుంది.

'హు ఎంత నిర్లక్ష్యం మనిషి, అని ఆమె విసుగు చెందింది. అంతలోనే అసలు ఈ మగజాతే అంతే. అందంగా ఉన్న ఆడది కనిపిస్తే చాలు వెంటపడి తిరుగుతారు. ఆకర్షించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. కానీ దురదృష్టవశాత్తూ ఆ స్త్రీయే గనుక ఆకర్షించబడితే వాడిపోయిన పుష్పంలా భావించి నిర్లక్ష్యం చేస్తారు.' ఈ మార్గంలో సాగుతున్నాయి భారతి ఆలోచనలు. కానీ తన ఆలోచనలకు తనే నవ్వుకున్నది.

అవును పాపం భాస్కరు తప్పేముంది. అసలు అతను తనెప్పుడూ ఆకర్షించడానికి ప్రయత్నించలేదు. ఒక వేళ తనే అతనికి ఎదురుపడితే తల వంచుకొని తప్పుకొని పోయేవాడు. క్రొత్తలో తను అతనిని మామూలుగానే భావించింది. భాస్కరు తన పరిచయం కోసం ప్రాకులాడతాడనీ, తనను ఆకర్షించడానికి ప్రయత్నిస్తాడని, ఏదో పని కల్పించుకొని తనతో మాట్లాడతాడని ప్రేమ లేఖల ద్వారాను, విరహ గీతాలు, ప్రణయ గేయాల ద్వారాను తన ప్రేమను తెలియపరుస్తాడని ఊహించింది. ఒక వేళ తనపట్ల దురుసుగా ప్రవర్తిస్తే ఎలా బుద్ధి చెప్పాలో ప్లాన్లు వేసుకున్నది. తను కాలేజిలో చదువుతున్నప్పుడు రోజూ ఇద్దరు రౌడీ వెధవలు వెంటపడి అసభ్యకరంగా వాగుతూ ఉండేవారు. ఒక రోజు వారి బాధ పడలేక దగ్గరకు పిలచి జోడు తీసుకుని ఇద్దరి చెంపలూ వాయించింది. అలాగే భాస్కరికి కూడా బుద్ధి చెబుదామని నిశ్చయించుకున్నది. కాని త్వరలోనే తన ఆశలు అడియాసలని, తన భావనలన్నీ కేవలం ఊహలేనని తెలుసుకున్నది భారతి. తను అతనికి ఎంత దగ్గర వుందామని ప్రయత్నిస్తే అతనంత దూరమవుతున్నాడు.

* * * *

భాస్కరు యువకుడు. చాలా తెలివయినవాడు. అందమూ, ఐశ్వర్యంతోపాటు విద్యనుకూడా ప్రసాదించాడు దేముడు. అతి చిన్నతనంలో బి. ఇ. ఫస్టుక్లాసులో ప్యాసయ్యి ఏదో కంపెనీలో ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. చూచేవారిని ఇట్టే ఆకర్షించే శక్తి ఏదో అతనికి ఉంది. లేకపోతే సన్నగా, పీలగా ఉండి, ఎప్పుడూ ఇస్త్రీ బట్టలతో తిరిగే అతనితో పరిచయం సంపాదించుకోవాలని ఎంతోమంది ఆడపిల్లలు ఎందుకు ప్రయత్నిస్తారు. అతనికిమాత్రం ఇవి ఏమీ పట్టవు. ఎప్పుడు చూచినా ఏదో ఆలోచిస్తున్నట్లు కనబడతాడు. యెవరయినా పలకరిస్తేమాత్రం చిరునవ్వుతో క్లుప్తంగా సమాధానమిచ్చి తప్పుకుంటాడు. అంతమాత్రంచేత అది గర్వం అనుకోడానికి వీలులేదు.

విజయవాడ మహాపట్నంలో నాలుగు గదులుగల విశాలమయిన ఇంటికి అరవయ్యి రూపాయలు అద్దె యిచ్చి అతనొక్కడూ ఉంటున్నాడంటే ఏవో కారణాలు ఉండి ఉండాలని అందరికీ తెలుసు. కానీ ఆ కారణాలు

ఏమిటో అడిగి తెలుసుకునే ధైర్యం, చనువూ, యెవరికీ లేవు.

*　　*　　*　　*

ఒక రోజు సాయంకాలం అయిదు గంటలకి వాకిట్లో ఉన్న పూల మొక్కలకి నీళ్ళు పోస్తూ గులాబి మొక్కలకు కుదురు చేస్తోంది శాంతమ్మగారు. ఇంతలో ఖరీదయిన బట్టలు కట్టుకున్న ఒక యువకుడు గేటు తీసుకుని లోపలికి వచ్చి నాలుగు వైపులా చూస్తూ శాంతమ్మగారికి నమస్కరించి అనుమతి లేకుండా లోపలికి వచ్చినందులకు క్షమించండని కోరాడు. పర్వాలేదు అలా కూర్చోండని కుర్చీ చూపి సంగతేమిటని ప్రశ్నించింది. మంచి ఇల్లొకటి అద్దెకు కావలసి వెదుకుతున్నాను, ఇంతవరకూ నాకు నచ్చినది దొరకలేదు. అందుకని ఇక్కడేమయినా వాటా కాళీగా ఉన్నదేమో తెలుసుకుందామని వచ్చాను,' అని తను వచ్చిన కారణం చెప్పాడు ఆ యువకుడు.

కొంచెం సేపు ఆలోచించింది శాంతమ్మగారు. తనూ అమ్మాయి భారతి, పనిపిల్ల రత్నానికి యింత డాబా అనవసరమని తోచింది మేడమీదనున్న నాల్గు గదులూ యివ్వడానికి నిశ్చయించింది. కాని పైకిమాత్రం మీకు వివాహమయిందా, పిల్లలెంతమంది? అని ప్రశ్నించింది. కానీ ఆ యువకుడు చిరునవ్వు నవ్వుచూ క్షమించండి. ఇంకా వివాహం కాలేదు. ఇక్కడ ఒక కంపెనీలో ఇంజనీరుగా పనిచేస్తున్నాను అని సమాధానమిచ్చాడు

అవివాహితునకు అద్దెకివ్వడానికి ముందు సందేహించినా అతని అమాయకమయిన మొహం చూచి యితని వల్ల పెంకిపిల్ల భారతికేమీ కష్టనష్టాలు కలగవని నిశ్చయించుకొని పై నాల్గు గదులు అద్దెకివ్వడానికి అంగీకరించింది. కాని యెప్పుడు కోరితే అప్పుడు యిల్లు కాళీ చెయ్యాలని షరతు పెట్టింది. ఆ షరతు కంగీకరించి ఆమె అడగకపోయినా ఒక నెల అద్దె అడ్వాన్సు యిచ్చి మరునాడు ఆ యింట్లో ప్రవేశించాడు తన నౌకరు భద్రంతో.

క్రొత్త వ్యక్తితో యెలా మెలగాలోయని సందేహించింది భారతి. కానీ ఆమెకంటే బిడియస్తుడయిన అతనితో ఆమె కేమీ కష్టం కలుగలేదు. పైపెచ్చు అతనితో పరిచయం చేసుకోవాలనే ఆకాంక్ష పెరిగిపోయింది.

*　　*　　*　　*

ఒక రోజు మామూలుగా కంపెనీకి బయలుదేరాడు భాస్కర్. ఏమండీ ఒకసారిలా వచ్చి వెళ్ళండి అని పిలిచింది భారతి. నన్నేనాండీ అంటూ వెళుతున్నవాడు ఆగి ప్రశ్నించాడు భారతిని. మరేనండీ మా అమ్మకు రాత్రి జ్వరం వచ్చిందండి, మూసినకన్ను తెరవలేదు. నాకు భయంగా ఉందండి అంది భారతి. వెంటనే భాస్కర్ లోపలికి వెళ్ళి శాంతమ్మగారిని పలకరించాడు కానీ జ్వరం తీవ్రంగా ఉండటంచేత ఆవిడ మగతగా నిద్రిస్తోంది. భాస్కర్ భారతిని చూచి మరేం పరాః లేదులెండి. ఏమీ ఆదుర్దా పడకండి నేను డాక్టర్ని, తీసుకువస్తాను, అని భారతికి ధైర్యం చెప్పి డాక్టరుకోసం వెళ్ళాడు.

డాక్టరు వచ్చి చూచి శాంతమ్మగారికి టైఫాయిడ్ని చెప్పాడు. ఏవో మందులు రాసిచ్చి తీసుకొస్తే ఇంజక్షనులు చేస్తాననగానే భాస్కర్ వెంటనే బజారుకి వెళ్ళి ఆ మందులు పట్టుకొచ్చాడు. శాంతమ్మగారికి జ్వరం తగ్గే దాకా భాస్కర్ శలవుపెట్టి భారతికి తోడుగా ఉండి ధైర్యం చెబుతూ మిక్కిలి శ్రమపడ్డాడు.

పది రోజులకు శాంతమ్మగారికి జ్వరం తగ్గింది. కుమార్తె వలన భాస్కర్ పడ్డ శ్రమ తెలుసుకుని అతని మంచితనానికి యెంతో మురిసిపోయింది. ఆరోజునుంచి అతనికి ప్రొద్దుటపూట కాఫీ టిఫిన్ తనే పంపసాగింది. కాఫీ, టిఫినూ తీసుకువెళ్ళినపుడు భారతి అతడితో చనువుగా మాట్లాడాలని ప్రయత్నించింది. కానీ, అతనుమాత్రం ఏదో పని కల్పించుకొని తప్పించుకునేవాడు.

మామూలుగా ఏడు గంటలకి నిద్దరలేచి టూత్ బ్రష్ నోటిలో పెట్టుకున్నాడు భాస్కర్. అప్పటికే కాలకృత్యాలు తీర్చుకుని చక్కగా మొకాన బొట్టుపెట్టుకుని ఒక వెండి ప్లేట్లో వేడి టిఫినూ, కాఫీ తీసుకుని డాబా మీదకు వెళ్లింది భారతి. రోజూ మీకీశ్రమ యెందుకండీ. అంటూ అవి తీసుకోడానికి మొహమాటపడ్డాడు భాస్కర్.

మా అమ్మగారు యెంతో ఆప్యాయంగా పంపిస్తే మీరు కాదంటే బాధపడతారు. త్వరగా తీసుకోండి చల్లారిపోతాయి. అని అతనిని తొందరచేసింది. అతను కాఫీ త్రాగుతుండగా ఏమండోయ్ మీరు ఈవేళ సాయంత్రం తొందరగా యింటికి రావాలి అంది భారతి. ఏమండీ విశేషమేమయినా ఉందా? అని ప్రశ్నించాడతడు. ఈవేళ నా పుట్టిన రోజు. సాయంకాలం సినిమా ప్రోగ్రాం

కూడా ఉంది: మీరు తప్పకుండా అయిదున్నరకే రావాలి అని హెచ్చరించింది. అలాగే తప్పకుండా వస్తాను అని అంగీకరించాడతడు:

♦ ♦ ♦ ♦

గోడగడియారం ఐదుగంటలు కొడుతుండగా బూట్లు చప్పుడు చేసుకుంటూ వచ్చాడు భాస్కర్. ఆ చప్పుడు విని బయటకువచ్చిన శాంతమ్మగారు ఏం నాయనా? ఆలస్యమయిందేం అని ఆప్యాయంగా పలుకరించి ఉండు నాయనా అమ్మాయిని పిలుస్తాను ఇప్పటిదాకా నువ్వు వస్తానని ఎదురు చూచింది. అని భారతిని పిలిచింది ఆమె.

ఏమండీ మీ గడియారంలో ఇప్పుడే అయిదున్నర అయిందా? అని ప్రశ్నించింది భారతి.

క్షమించండి. అయిదుగంటలకే బయలుదేరాను. కానీ ఒక వర్కరుకు యాక్సిడెంటయితే అతనిని హాస్పిటల్ లో చేర్చి రావడములో ఆలస్యమయింది. ఏమనుకోకండి. అన్నాడు భాస్కర్. భలేవారండీ మీరు ఈమాత్రం దానికి క్షమాపణలు దేనికి రండి కూర్చోండి, అని కుర్చీ చూపింది భారతి.

ఆ మర్చిపోయాను. మీ బర్త్ డేకి ఒక చిన్న ప్రజంటు తెచ్చాను. కాదనకండి అంటూ తన చేతిలోని ప్యాకెట్టు అందించాడామెకు.

ఎందుకండీ ఇవన్నీ, అంటూ ప్యాకెట్టువిప్పింది భారతి. బ్రౌనుకలరు టెర్లెన్స్ శారీని చి అతడి సెలక్షను మెచ్చుకోకుండా ఉండలేక పోయిందామె.

భాస్కర్ తెచ్చిన చీరకట్టుకుని తల్లికి నమస్కరించింది భారతి. చాలా బాగుంది అని ఆమె చీరను మెచ్చుకుని అతడికి చూపించావా అని అడిగింది. లేదు చూపిస్తాను. అని భాస్కరుకి చూపించడానికి వెళ్ళింది.

మీరు కట్టుకున్నందువలన చీరకు అందం వచ్చిందండి. అని మెచ్చుకున్నాడు భాస్కర్. నవ్వింది భారతి. సరే గానండీ నాసినిమా ప్రోగ్రాం చెడగొట్టారు గాబట్టి అలా ప్రకాశం బ్యారేజిదాకా షికారు వెళ్ళి వద్దారండి అని బలవంతం చేసింది బారతి. వెళ్ళక తప్పలేదు బాస్కరుకి. (సశేషం)

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులముకాదు. —సంపాదకుడు



♦

రేఖా అండు మురళీవారి

''కథానాయిక మొల్ల''లో

శ్రీ హరనాద్ - వాణిశ్రీ

♦